# నమస్తే తెలంగాణ
## మంచిర్యాల
### కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | శుక్రవారం 7 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




### ❖ బీసీలకు తీరని అన్యాయం

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 6: కుల గణనలో బీసీలకు తీరని అన్యాయం జరిగింది. అసలు కుల గణన అనేది అందరికీ నచ్చినట్లు కాకుండా వారికి అనుగుణంగా చేసుకున్నారని చెప్పవచ్చు. ఇందులో అన్ని కులాలకు ప్రాధాన్యత దక్కలేదు. ఈడబ్ల్యూఎస్ ప్రస్తావన రాలేదు. బీసీలు తగ్గి రెడ్డి, రావులు పెరిగినట్లు కుల గణనలో చూపుతున్నారు. రాష్ట్రంలో బీసీలతో పాటు మైనార్టీ బీసీలను కలిపితే మొత్తం 60 శాతానికి పైగా జనాభా ఉంటుంది. కానీ ప్రభుత్వం తప్పుల తడకగా పేర్కొన్నది. మాలమాదిగ, బహుజనులు కోటా కోసం పోరాడుతున్నారు. వారిని కూడా మోసం చేస్తున్నారు. బీసీల్లో కూడా అందరికీ అవకాశం దక్కాలి. సామాన్యుడికి బీసీ గణన చేరలేదు. బీసీ గణనపై ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మంచిర్యాలలో శుక్రవారం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మౌనప్రదర్శన చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో బీసీ జనులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలి.

**- డాక్టర్ చుంచు రాజ్‌కిరణ్, బీసీ జేఏసీ మంచిర్యాల జిల్లా కన్వీనర్**



ఇంద్రవెల్లిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఎం చిత్రపటాలను దహనం చేస్తున్న దళిత సంఘాల నాయకులు

### రేవంత్‌రెడ్డి ఎస్సీల్లో ఐక్యతను దెబ్బ తీస్తున్నాడు..

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 6 ః రాజ్యాంగానికి వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేస్తూ ఉపకులాలవారీగా తప్పుడు రిజర్వేషన్లు కల్పించడంతో ఎస్సీలకు నష్టం కలుగుతుందని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్, ప్రధాన కార్యదర్శి కామ్‌రాజ్ వాగ్మారే అన్నారు. మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపి, సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలను దహనం చేశారు. ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీలలోని ఐక్యతను దెబ్బతీయడానికి కుట్రలు చేస్తుందన్నారు.

### ❖ ఎస్సీ వర్గీకరణతో నష్టం



ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 6 ః రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఎస్సీ వర్గీకరణతో ఉప కులాలకు రిజర్వేషన్ల పరంగా నష్టం కలుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం కావాలని ఎస్సీలపై సర్వే చేయించింది. ఎస్సీ వర్గీకణను వెంటనే ప్రభుత్వం రద్దు చేయాలి. కులగణన సర్వే తప్పుల తడకగా ఉంది. ఇప్పటికే ఎస్సీలలోని అనేక కులాలు అన్ని రంగాల్లో అభివృద్ధికి దూరం అవుతున్నాయి.

**- కామ్‌రాజ్ వాగ్మారే, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల ప్రధాన కార్యదర్శి.**

### ❖ మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి..



నిర్మల్, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన కులగణన ప్రకారం మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి. సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీ సాక్షిగా చెప్పిన లెక్కల మేరకు రాష్ట్రంలో 15 శాతం మంది మాలలు ఉన్నారు. వారికి 5 శాతం రిజర్వేషన్లు కేటాయించినప్పుడు, అదే నిష్పత్తి ప్రకారం 32 శాతం ఉన్న మాదిగలకు జనాభా ప్రాతిపదికన 11 శాతం రిజర్వేషన్లు కేటాయించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం 9 శాతం మాత్రమే కేటాయించి మాదిగలకు మోసం చేసింది. వాస్తవానికి జనాభా ప్రకారం చూస్తే మాలలకు 3 శాతం మాత్రమే వర్తింపజేయాలి. గతంలో మాదిగలు, మాలలు, వాటి ఉప కులాలను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరించి రిజర్వేషన్లు అమలు చేశారు. అప్పుడు కొంత వరకు మాదిగలకు న్యాయం జరిగింది. ఇప్పుడు నాలుగు గ్రూపులను 1,2,3 కేటగిరీలు చేశారు. మాదిగల కేటగిరీలో ఉన్న బుడగ జంగాలను 1వ కేటగిరీలో కలుపడంతో లక్షకు పైగా జనాభా ఉన్న వారు 2వ కేటగిరీలో తగ్గిపోయారు. దీంతో మాదిగల జనాభా మరో లక్ష వరకు తగ్గింది. మాదిగలకు రిజర్వేషన్లు తగ్గించాలన్న కుట్రతోనే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి కొత్త నాటకాలకు తెరలేపింది. మాదిగలు, మాలలకు మధ్య చిచ్చు పెట్టేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి వివాదాలను సృష్టిస్తున్నది. 30 ఏళ్లుగా ఎస్సీల వర్గీకరణ కోసం మాదిగలు అనేక పోరాటాలు చేయగా, ఇటీవలే సుప్రీం కోర్టు వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఈ వర్గీకరణ ఫలాలు మాదిగలకు పూర్తి స్థాయిలో అందకుండా చేస్తున్న కాంగ్రెస్ పాలకుల కుట్రలను సమర్థవంతంగా తిప్పికొడతాం. అవసరమైతే మరిన్ని ఆందోళనలు చేపట్టి 11 శాతం రిజర్వేషన్లు సాధించే వరకు మాదిగలతో కలిసి పోరాడుతాం. **- శ్యాంసుందర్, బీఆర్‌ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయకర్త**



నిర్మల్ కలెక్టరేట్ ఎదుట మాట్లాడుతున్న బీసీ హక్కుల సాధన సమితి నాయకులు

### బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలి..

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 6 ః పార్లమెంట్ చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ బిల్లు ప్రవేశ పెట్టి అమలు పర్చాలని బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో గురువారం కలెక్టర్ కార్యాలయంలో నిరసన తెలిపి అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకుడు విలాస్ మాట్లాడుతూ.. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని, రూ.2 లక్షల కోట్లతో బీసీ సంక్షేమ, అభివృద్ధి కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించాలన్నారు. బీసీ అట్రాసిటీ చట్టాన్ని రూపొందించాలన్నారు. జిల్లాల్లో బీసీ భవనాలు నిర్మించాలని, బీసీ జనాభా ప్రాతిపదికన స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

### ❖ రాజ్యాంగ విరుద్ధం



ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 6 ః రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఎస్సీల వర్గీకరణతో దళిత బహుజనులకు రిజర్వేషన్ల పరంగా నష్టం జరుగుతుంది. ఎస్సీలను కులాలవారీగా విడదీసి రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగానికి విరుద్ధంగా ఉంది. ఎస్సీల ఐక్యతను చెల్లా చెదురు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కుట్ర చేసింది. ఎస్సీ వర్గీకణను ప్రభుత్వం రద్దు చేసి దళిత బహుజనులకు న్యాయం చేయాలి. వర్గీకరణ చేయడంతో ఎస్సీలలో ఉన్న ఉప కులాలకు నష్టం తప్ప న్యాయం జరగదు. **- కాంబ్లే అతిష్, దళిత సామాజిక కార్యకర్త.**




# సంకుల సమరం

## కాంగ్రెస్ సర్కారుపై నిప్పులు చెరుగుతున్న బీసీలు, దళితులు

- 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే ఉద్దేశం లేదంటున్న బీసీలు
- 11 శాతం రిజర్వేషన్ ఇవ్వాల్సిందేనంటూ మాదిగల పట్టు
- వర్గీకరణపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్న మాలలు
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలు దహనం

మంచిర్యాల, ఫిబ్రవరి 6(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కులగణన సర్వే నివేదికపై అన్ని వర్గాల నుంచి నిరసన వ్యక్తం అవుతున్నది. సర్వే సరిగా లేదంటూ బీసీలు, దళితుల నుంచి తీవ్రమైన వ్యతిరేకత వస్తున్నది. కులగణన నివేదిక తప్పుల తడకగా రూపొందించారని, దురుద్దేశపూర్వకంగా బీసీ జనాభాను తగ్గించి చూపారని కాంగ్రెస్ సర్కారుపై బీసీలు రగిలిపోతున్నారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను విస్మరించి, కేవలం కాంగ్రెస్ పార్టీ పరంగా వాటా కల్పిస్తామని చెప్పడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ పార్టీ విస్మరించిందని, రాష్ట్రంలోని బీసీలను వెన్నుపోటు పొడిచిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా చేసిన ఇంటింటి సర్వేను పక్కన పెట్టి ఎస్సీ వర్గీకరణకు పోవడంపై దళితులు ఆగ్రహంతో ఉన్నారు. మాదిగలకు అన్యాయం చేశారంటూ ఆ సామాజిక వర్గం నాయకులు అంటున్నారు. రాష్ట్రంలో 15 లక్షల జనాభా ఉన్న మాలలకు 5 శాతం రిజర్వేషన్ ఇస్తే, 52 లక్షల జనాభా ఉన్న మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. పాత లెక్కలను అనుసరించి 9 శాతం ఇవ్వడాన్ని మాదిగలు తీవ్రంగా తప్పు బడుతున్నారు. మరోవైపు మాల సామాజిక వర్గం ఎస్సీ వర్గీకరణపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నది. తాము కూడా వర్గీకరణతో నష్టపోతున్నామంటున్నారు. ఇలా బీసీ, మాదిగ, మాల సామాజిక వర్గాలు ఎవరికి వారు సర్కారు తీరుపై మండిపడుతున్నాయి.

#### కాంగ్రెస్‌లో చీలిక

కులగణన సర్వే నివేదిక తప్పులతో జనాల్లో వ్యతిరేకత పెరగగా.. అధికారిక కాంగ్రెస్ పార్టీలో రాష్ట్ర స్థాయి నుంచి మండల, గ్రామస్థాయి దాకా ఆ పార్టీ నాయకుల్లో చీలక వచ్చినట్లు తెలుస్తున్నది. రాష్ట్రంలో బీసీ జనాభా ఎక్కువగా ఉన్న నేపథ్యంలో బీసీలకు డిప్యూటీ సీఎం సహా మరో రెండు మంత్రి పదవులకు బీసీ లీడర్లు అధిష్టానం ముందు పట్టుపడుతున్నారట. ఇక ఎస్సీ వర్గీకరణపై మాదిగ, మాల సామాజిక వర్గం ఎమ్మెల్యేలు రెండుగా చీలిపోయారనే వార్తలు వస్తున్నాయి. మాలల పక్షాన వర్గీకరణపై చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ ఢిల్లీకి వెళ్లి మరీ లాబీయింగ్ చేస్తున్నట్లు పలు వార్తా కథనాలు వస్తున్నాయి. మరోవైపు మాదిగ సామాజిక వర్గం నాయకులు ఇప్పుడు ఇస్తామంటున్న 9 శాతం రిజర్వేషన్లు 11 శాతానికి పెంచాలంటూ డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంలో పార్టీలోని దళిత నాయకులు రెండు వర్గాలుగా చీలిపోయినట్లు తెలుస్తున్నది. అదే తరహాలో జిల్లా, మండల, గ్రామ స్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో పొరపొచ్చాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకతిస్తూ ఉమ్మడి జిల్లాలో దళిత నాయకులు ఇప్పటికే రోడ్లపైకి వచ్చారు. ఇంద్రవెల్లిలోఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు నాయకులు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలను దహనం చేశారు. దేశ జనగణలో కులగణన జరపాలని పార్లమెంట్ సమావేశాల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ బిల్లు పెట్టి అమలు పర్చాలని బీసీ హక్కుల సాధన సమితి ఆధ్వర్యంలో నిర్మల్ కలెక్టర్ కార్యాలయంలో నిరసన తెలిపి రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.



కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

## ఘనంగా ఎమ్మెల్యే కోవలక్ష్మి పుట్టిన రోజు వేడుకలు

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 6 : ఆసిఫాబాద్‌లో ఎమ్మెల్యే కోవలక్ష్మి పుట్టిన రోజు వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సాయిబాబా ఆలయంలో కోవ లక్ష్మి తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు మధుకర్ శర్మ, ప్రశాంత్ శర్మ ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం తన నివాసం వద్ద కుటుంబ సభ్యులతో కలిసి ఆమె కేక్ కట్ చేశారు. అభిమానులు, నాయకులు కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు, జీఎం శ్రీనివాస్ తరలివచ్చి ఆమెకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. వినోద్ జస్వాల్, ఎండీ అహ్మద్ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ హైమద్, మండల అధ్యక్షుడు జాబరే రవీందర్, నాయకులు అన్సార్, నిసర్, హైమద్, రవి, హైమద్, ఖాసిం, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వివరాల సేకరణ పూర్తి

మంచిర్యాలటౌన్, ఫిబ్రవరి 6 : మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్‌లో విలీనమవుతున్న నస్పూరు మున్సిపాలిటీతో పాటు హాజీపూర్ మండలంలోని పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూర్, చందనాపూర్, ముల్కల, కొత్తపల్లి, వేంపల్లి గ్రామ పంచాయతీలకు సంబంధించిన వివరాల సేకరణ ప్రక్రియ పూర్తయింది. జనవరి 27న మంచిర్యాల మున్సిపాలిటీని కార్పొరేషన్‌గా మారుస్తూ ఉత్తర్వులు వెలువడిన విషయం విదితమే. ఆ వెంటనే కార్యాలయాలకు కార్పొరేషన్ బోర్డులు ఏర్పాటు చేశారు. కార్పొరేషన్‌లో విలీనమవుతున్న నస్పూరు మున్సిపాలిటీతో పాటు హాజీపూర్ మండలంలోని ఎనిమిది గ్రామపంచాయతీలకు సంబంధించిన ఉద్యోగులు, ఆస్తులు, ఇండ్లు, రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, లే అవుట్‌లు, ప్రభుత్వ స్థలాలు, ప్రభుత్వ భవనాలు, ఫర్నిచర్, విద్యుత్ దీపాలు, వాహనాలు, తదితర వివరాలన్నింటినీ సేకరించారు. బ్యాంక్ ఖాతాలన్నింటినీ మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పేరిట తెరవాలని సూచించారు. ఈ నెల 6వ తేదీనాటికి విలీన మున్సిపాలిటీ, గ్రామపంచాయతీల వివరాలన్నింటినీ సేకరించి ప్రభుత్వానికి అందించాలని వచ్చిన ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను పూర్తిచేశారు.

## పెద్దపులి గాండ్రింపులు



కాసిపేట : కొత్త వరిపేటలో పెద్దపులి పాదముద్రలు

- కొత్త వరిపేటలో మరో అడవి పందిని హతమార్చిన టైగర్
- భయాందోళనలో ప్రజలు

కాసిపేట, ఫిబ్రవరి 6 : మండలంలోని కొత్త వరిపేట, పెద్దనపల్లి, దుబ్బగూడెం, సోమగూడెం పాత బస్తీ, బుగ్గగూడెం, కన్నాల శివారులలో పెద్దపులి(బీ1) సంచరిస్తూ ప్రజలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నది. నాలుగు రోజుల క్రితం కన్నాల శివారులో అడవి పందిపై దాడి చేసి హతమార్చగా, గురువారం కొత్త వరిపేటలో మరో అడవిపందిని చంపేసింది. కొంత మాంసాన్ని తిని వెళ్లిపోయినట్లు తెలిసింది. పెద్దనపల్లి శివారులోని కాసిపేట, బెల్లంపల్లికి వచ్చే దారిలో నూతనంగా సింగరేణి వేస్తున్న రోడ్డు మార్గంలో పెద్దపులి గాండ్రింపులు వినపడినట్లు స్థానికులు చెబుతున్నారు. ఆ ప్రాంతంలో దాని పాదముద్రలు కనిపించాయి. మరుసటి రోజు కళేబరం వద్దకు వచ్చే అవకాశముండడంతో అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఈ అటవీ ప్రాంతంలో నీటి వసతితో పాటు అడవి పందుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో పులి ఆవాసం ఏర్పాటు చేసుకునే అవకాశమున్నట్లు అధికారులు భావిస్తున్నారు. దానికి ఎలాంటి హానీ జరగకూడదనే ఉద్దేశంతో ఫారెస్ట్ అధికారులు ఎప్పటికప్పుడు కదలికలు గమనిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లోకి రాకపోకలు నిలిపివేశారు. పులి కనిపిస్తే వెంటనే సమాచారమివ్వాలని వారు కోరుతున్నారు.

## ఫారెస్ట్ ఆంక్షలు ఎత్తివేయాలని ధర్నా



మంచిర్యాల అర్బన్ : జిల్లా అటవీ శాఖ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎఫ్ నాయకులు

మంచిర్యాల అర్బన్/నస్పూర్, ఫిబ్రవరి 6 : జన్నారం మండలంలోని కవ్వాల్ టైగర్ ఫారెస్ట్‌లో విధించిన ఆంక్షలు వెంటనే ఎత్తివేయాలని, స్థానికులతో దురుసుగా ప్రవర్తిస్తున్న అటవీశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని నవతరం స్టూడెంట్ ఫెడరేషన్ (ఎన్‌ఎస్‌ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా అటవీ శాఖ అధికారి కార్యాలయం వద్ద నాయకులతో కలిసి ధర్నా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ సమస్య తీవ్రరూపం దాల్చకముందే అధికారులు చొరవ తీసుకొని జన్నారం మండలంలో విధిస్తున్న ఆంక్షలను ఎత్తివేయాలని, లేదంటే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రాకేశ్, ఆదిత్య, అభిరామ్, సల్మాన్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలి

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే**



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, ఫిబ్రవరి 6 : మెదక్–నిజామాబాద్–కరీంనగర్–ఆదిలాబాద్ శాసనమండలి ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, కాగజ్‌నగర్ సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్‌తో కలిసి పట్టభద్రులు, ఉపాధ్యాయ నియోజకవర్గాల శాసనమండలి సభ్యుల ఎన్నికలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన 17 పోలింగ్ కేంద్రాల పరిధిలో 416 మంది ఉపాధ్యాయులు, సుమారు 6 వేల మంది పట్టభద్రులు ఉన్నారని, నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీలకు సంబంధించిన హోర్డింగులు, గోడ రాతలు, జెండాలు, ప్రకటనలు తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎంసీ కమిటీ ఏర్పాటు చేసి పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడి యా, సామాజిక మాధ్యమాల్లో వచ్చే ప్రచారాలను నిశితంగా పరిశీలించడం జరుగుతుందని, ఆయా రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రచారానికి అవసరమైన అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణకు అవసరమయ్యే బ్యాలెట్ బాక్సులను సరిచూసుకోవాలని, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లకు అనువైన ప్రదేశాలను ఎంపిక చేయాలని, ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించాలని సూచించారు.

## అక్రమ కట్టడాలను తొలగించాలని ఆందోళన

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 6 : కాగజ్‌నగర్ పట్టణంలోని నాలాను కబ్జా చేసి నిర్మించిన అక్రమ కట్టడాలను వెంటనే తొలగించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు త్రివేణి, కాలనీ వాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఇండస్ట్రియల్ ఏరియాలో నాలా పక్కన టెంట్ ఏర్పాటు చేసుకొని ఆందోళన నిర్వహించారు. వారు మాట్లాడుతూ వీఐపీ స్కూల్‌కు సంబంధించి ఒక పిల్లర్ నాలలో నిర్మించారని, దీనికి విద్యాశాఖ అధికారులు అనుమతులు ఎలా ఇచ్చారని, ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యులెవరని ప్రశ్నించారు. సమీపంలోనే మరో కళాశాల యాజమాన్యం సైతం నాలా స్థలం కబ్జా చేసి నిర్మించారని ఆరోపించారు. సర్వే నంబర్ 135 పక్కన స్థలం లేకపోయినా నాలా కబ్జా చేస్తు నిర్మాణాలు చేపడుతున్నారని మండిపడ్డారు. ఇలా ఎన్‌టీఆర్ చౌరస్తా నుంచి పట్టణ పరిసర ప్రాంతం వరకు నాలా కబ్జాకు గురైందని, విద్యాసంస్థలు, నివాస గృహాలు, వ్యాపార భవనాలు నిర్మించారని, వెంటనే గుర్తించి తొలగించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ అంజయ్య దృష్టికి తీసుకెళ్లామని, కమిషనర్ స్పందించకుంటే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు రోహిని, మాచర్ల శ్రీనివాస్, తిమ్మయ్య, ప్రకాశ్, రాజయ్య, నర్సయ్య, కృష్ణ పాల్గొన్నారు.